# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 30-01-2025** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **దేశంలో కీలక ఖనిజాల అభివృద్ధికి 16 వేల 300 కోట్ల రూపాయల వ్యయంతో నేషనల్ క్రిటికల్ మినరల్ మిషన్‌కు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది.**
2. **వాట్సప్ ద్వారా పౌర సేవలు అందించే విధానాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈరోజు నుంచి ప్రారంభించనుంది..**
3. **కేంద్ర ఉక్కు శాఖ మంత్రి హెచ్‌డీ కుమారస్వామి ఈ రోజు విశాఖపట్నంలోని ఉక్కు కర్మాగారాన్ని సందర్శిస్తారు.**
4. **తెలంగాణలో నిర్వహించిన ఇంటింటి సమగ్ర కుటుంబ గణన విజయవంతమైందని ముఖ్యమంత్రి ఏ.రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.**
5. **ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికల షెడ్యూల్‌ను ఎన్నికల సంఘం విడుదల చేసింది.**

==========================

దేశంలో కీలక ఖనిజాల అభివృద్ధికి 16 వేల 300 కోట్ల రూపాయల వ్యయంతో నేషనల్ క్రిటికల్ మినరల్ మిషన్ అమలుకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపిందని కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన నిన్న ఢిల్లీలో జరిగిన కేంద్ర మంత్రి వర్గ సమావేశ నిర్ణయాలను కేంద్ర మంత్రి పాత్రికేయులకు వెల్లడించారు. కీలక ఖనిజాల రంగంలో స్వయం సమృద్ధి సాధించడంతోపాటు హరిత ఇంధన రంగానికి ఉపయోగపడే విధంగా ఈ మిషన్ దోహదం చేయనుందని తెలుపుతూ,

వాయిస్ 28 సెకన్లు

--------------------------

ప్రభుత్వం అందించే పౌరసేవలపై ప్రజల నుంచి వినతులు స్వీకరించేందుకు, వారికి అవసరమైన సమాచారాన్ని చేరవేసేందుకు వీలుగా వాట్సప్ గవర్నెన్స్‌ను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈ రోజు ప్రారంభించనుంది. తొలి దశలో మొత్తం 161 రకాల పౌర సేవలు అందించనుంది. రెండో విడతలో మరిన్ని సేవలను అందుబాటులోకి తీసుకురానుంది. తొలి విడతలో దేవాదాయ, ఇంధన, ఏపీఎస్ఆర్టీసీ, రెవెన్యూ, మున్సిపల్ తదితర శాఖల్లో ఈ సేవలు మొదలవుతాయి. ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ ఈ రోజు ప్రారంభిస్తారు.

మరోవైపు వాట్సప్ గవర్నెన్స్ పై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిన్న రాష్ట్ర సచివాలయంలో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వాట్సప్ సేవలతో ధ్రువపత్రాల కోసం పౌరులు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే విధానానికి స్వస్తి పలకనున్నట్లు వెల్లడించారు. ఈ విధానం అమలుపై అధికారులకు పలు సూచనలు చేశారు.

---------------------------

కేంద్ర ఉక్కు శాఖ మంత్రి హెచ్‌డీ కుమారస్వామి ఈరోజు విశాఖపట్నం ఉక్కు కర్మాగారాన్ని సందర్శిస్తారని కేంద్ర ఉక్కుశాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ తెలిపారు. ఢిల్లీలో కేంద్ర మంత్రి నిన్న పాత్రికేయులతో మాట్లాడుతూ, ఉక్కు కర్మాగారం 7.3 మిలియన్ టన్నుల పూర్తిస్థాయి వార్షిక ఉత్పత్తి అనంతరం విలీనం అంశంపై కేంద్ర ప్రభుత్వం పరిశీలిస్తుందని చెప్పారు. ఆంధ్రుల భావోద్వేగాలతో నెలకొల్పిన ఈ ప్లాంట్‌ను పరిరక్షించాలన్నా ఉద్దేశంతోనే కేంద్ర ప్రభుత్వం 11 వేల 400 కోట్ల రూపాయల ప్యాకేజీ ప్రకటించిందని అన్నారు. ప్రైవేటీకరణ ప్రచారాన్ని కేంద్రమంత్రి నమ్మవద్దని సూచించారు.

---------------------------

తెలంగాణలో నిర్వహించిన ఇంటింటి సమగ్ర కుటుంబ గణన విజయవంతమైందని ముఖ్యమంత్రి ఏ.రేవంత్‌రెడ్డి తెలిపారు. హైదరాబాద్‌లోని పోలీసు కమాండ్ కంట్రోల్ కేంద్రంలో కుటుంబ సర్వేపై రాష్ట్ర మంత్రులు, సంబంధిత శాఖల అధికారులతో ముఖ్యమంత్రి ఉన్నతస్థాయి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సామాజిక సాధికారతను సాధించడానికి, భవిష్యత్తులో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాల అభ్యున్నతికి కుటుంబ గణన ఉపయోగపడుతుందన్నారు. సర్వే సమాచార నమోదు పూర్తయిందని, రెండు రోజుల్లో ముసాయిదా నివేదికను సిద్ధం చేసి, ఫిబ్రవరి 2న మంత్రివర్గ ఉపసంఘానికి అందించాలని అధికారులను ఆదేశించారు.

---------------------------

గణతంత్ర దినోత్సవ కవాతులో ప్రదర్శించిన శకటాల్లో ఆంధ్రప్రదేశ్ మూడో స్థానంలో నిలిచింది. తొలి రెండు స్థానాల్లో ఉత్తర ప్రదేశ్, త్రిపుర ఉన్నాయి. ఈ మేరకు పరేడ్ శకటాల ఫలితాలను రక్షణ మంత్రిత్వశాఖ ప్రకటించింది. ఇదిలా ఉండగా ఆంధ్రప్రదేశ్ శకటానికి మూడోస్థానం రావడం పట్ల ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హర్షం వ్యక్తం చేశారు. ఇది రాష్ట్ర ప్రజలకు గర్వకారణమని తెలిపారు. అలాగే రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ స్పందిస్తూ... ఆంధ్ర హస్తకళల వైభవాన్ని ప్రతిబింబించేలా రూపొందించిన ఏటికొప్పాక బొమ్మలకు గుర్తింపు రావడం ఆనందంగా ఉందని తెలిపారు.

---------------------------

తెలంగాణ ప్రభుత్వం వ్యవసాయ రంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. హైదరాబాద్‌లో మంత్రి నిన్న మాట్లాడుతూ రాష్ట్ర బడ్జెట్‌లో 72 వేల కోట్ల రూపాయలతో 35 శాతం నిధులను వ్యవసాయం, అనుబంధ రంగాలకు కేటాయించినట్లు చెప్పారు. అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదిలోనే రైతు రుణమాఫీ చేశామన్నారు. సాగు చేసే రైతులకు సాయం అందించే లక్ష్యంతో రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా వంటి పథకాలను ప్రారంభించామని తెలిపారు. రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి వివరించారు.

---------------------------

జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా దేశం యావత్తు ఘనంగా నివాళులర్పిస్తోంది. సత్యం, అహింస, శాంతి ఉత్తమ మార్గాలని విశ్వసించి... ఆ సిద్ధాంతాలతో .... భారత దేశానికి స్వాతంత్ర్యం సాధించిన మహనీయులు మహాత్మగాంధీ. ఆయన మరణించి ఈ రోజుతో 77 సంవత్సరాలు పూర్తయింది. మహాత్మాగాంధీ వర్ధంతిని అమరవీరుల సంస్మరణ దినంగా ఈరోజు పాటిస్తున్నారు. 1862 అక్టోబర్ 2వ తేదీన గుజరాత్ రాష్ట్రంలోని పోర్ బందర్‌లో జన్మించిన బాపూజీ తన జీవితాన్ని స్వాతంత్ర్య సాధనకోసమే అంకితం చేశారు. 1948 జనవరి 30న నాధూరామ్ గాడ్సే తుపాకి గుళ్ళకు నేలకొరిగిన మహాత్మాగాంధి జీవితం భారత హృదయాలపై చెరగని ముద్రవేసింది. ప్రజలు మంచిని స్వీకరించి.. చెడును త్యజించాలని ఒకానొక సందర్భంలో మహాత్మాగాంధీ పిలుపునిస్తూ......

వాయిస్ 32 సెకన్లు

---------------------------

ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికల షెడ్యూల్ ను ఎన్నికల సంఘం విడుదల చేసింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో మూడు చొప్పున స్థానాల్లో ఈ ఎన్నికలు జరగనున్నాయి. ఫిబ్రవరి 3న నోటిఫికేషన్ విడుదల కానుంది. అదే నెల 27న పోలింగ్ నిర్వహించి.. మార్చి 3న ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ఉమ్మడి ఉభయగోదావరి, కృష్ణా-గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గాలకు ఎన్నికలు నిర్వహించనున్నారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం ఉపాధ్యాయ స్థానానికి పోలింగ్ జరగనుంది.

అలాగే తెలంగాణలోని మెదక్-నిజామాబాద్-ఆదిలాబాద్-కరీంనగర్ ఉపాధ్యాయ నియోజకవర్గానికి ఎన్నికలు నిర్వహించనున్నారు. అదే స్థానంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు కూడా జరగనున్నాయి. వీటితో పాటు వరంగల్-ఖమ్మం-నల్గొండ ఉపాధ్యాయ నియోజకవర్గానికి ఎన్నికలు నిర్వహించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసింది.

---------------------------

రాష్ట్ర ప్రభుత్వం క్రీడా రంగానికి ప్రాధాన్యతనిస్తోందని ఆంధ్రప్రదేశ్ క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. నంద్యాలలోని స్థానిక కళాశాల మైదానంలో నిర్వహించిన 28వ జూనియర్ నేషనల్ సెపక్ తక్రా ఛాంపియన్ షిప్ వేడుకల్లో మంత్రి నిన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరి జీవితంలో క్రీడలను భాగం చేసుకోవాలని అన్నారు. కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్ వంటి ఒలంపిక్ క్రీడలకు ప్రభుత్వం అనేక ప్రోత్సాహకాలను ఇస్తోందని మంత్రి తెలియజేస్తూ,

వాయిస్ ... 30 సెకన్లు

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు నగరంలో ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు చేపడుతున్నామని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. నగరంలోని శంకర్ విలాస్ వద్ద పైవంతెన పునర్నిర్మాణ పనులను మంత్రి నిన్న పరిశీలించారు. అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, గుంటూరులో ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు పై వంతెనను నిర్మిస్తున్నామని చెప్పారు. త్వరలో నిర్మాణాన్ని పూర్తి చేసి ప్రజలకు ఈ వంతెనను అందుబాటులోకి తెస్తామని మంత్రి తెలిపారు.

=====================